క్లుప్తంగా

మహిళలపై దాడులు దారుణం



యశోదమ్మను పరామర్శిస్తున్న పెద్దిరెడ్డి

సదుం: మహిళలపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడటం దారుణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమల మండలం కొల్లావారిపల్లెలో టీడీపీ నాయకులు భూ తగాదాల నేపథ్యంలో దాడి చేయడంతో శనివారం యశోదమ్మ గాయపడింది. ఆమె స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతుండడంతో ఆయన పరామర్శించారు. గ్రామాలలో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు ఎక్కువ అయ్యాయని, దీనిని ప్రజలు హర్షించరనేది గుర్తెరగాలని హితవు పలికారు. దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పుట్రాజు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా శ్రావణి



రొంపిచెర్ల: మండల వ్యవసాయాధికారిగా శ్రావణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏవో సుధారాణి అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని భూసార పరీక్ష కేంద్రానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలోకి కేవీపల్లె మండల వ్యవసాయాధికారి శ్రావణి ఇక్కడికి వచ్చారు. ఆమె మాట్లాడుతూ, మండలంలో రైతులు పంటల సాగులో మంచి దిగుబడులు సాధించేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు. పంటల మార్పిడితోనే అధిక దిగుబడి సాధ్యమన్నారు. ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహద్వార నిర్మాణానికి భూమిపూజ



భూరుగులపల్లె వద్ద భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

గుడుపల్లె: మల్లప్పకొండపై కొలువై ఉన్న శ్రీ స్వర్ణగిరి మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డుపై సంగనపల్లె గ్రామస్తులు మహద్వార నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. కొండపై వెళ్లే రోడ్డులోని భూరుగులపల్లె వద్ద దీనిని నిర్మించేందుకు పండితులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు మల్లప్పకొండ ఆలయం ప్రత్యేకతను తెలియజేయడానికి ఈ మహద్వార నిర్మాణానికి పూనుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంగనపల్లె బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాలపూజలు



ప్రత్యేక పూజలందుకున్న గంగమ్మ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధిచేశారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల నడుమ ఈ పూజలు చేశారు. పలు ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని బంగారు నగలు, రంగు రంగు పూలతో ముస్తాబుచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

కూటమి నేతల జేబుల్లోకి 'ఉపాధి'





పలమనేరు మండలం కొలమాసనపల్లె పంచాయతీలో జేసీబీలతో పాత పనులకే చేస్తున్న మెరుగులు , వీకోట మండలంలో జేసీబీతో చేస్తున్న పనులు

- గతంలో చేసిన గుంతలకే జేసీబీలతో పైపై మెరుగులు, వాటికే బిల్లులు
- పనులకు గుత్తకిచ్చి, ఆపై కూలీల చేసినట్టు బిల్లులు
- జాబ్‌కార్డుదారుల ఖాతాలో కూలి డబ్బులు స్వాహా
- ఉపాధి అధికారుల సాక్షిగా సాగుతున్న అక్రమాలు

పలమనేరు: వలస నిరోధించేందుకు కూలీలకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూటమి నేతలకు ఉపాధిగా మారింది. ఉపాధి పనులకు కేటాయించుకోవడం వాటిని జేసీబీలతో గంటల వ్యవధిలో చేయడం, ఆపై కూలీలతో పనులు చేసినట్లు ఉపాధి సిబ్బంది సహకారంతో ఫొటోలు తీసి, మస్టర్లు రాసి, బిల్లులు చేసుకోవడం ఇప్పుడు అధికార పార్టీ చోటా నేతలకు కాసులు కురిపిస్తోంది. ఉపాధి కూలీల ఖాతాలకు నగదు జమ కాగానే వెంటనే వచ్చి ఆ డబ్బును ఎంచక్కా నేతలు పుచ్చుకుంటున్నారు. చేయని పనులకు కూలీలకు ఎంతో కొంత ఇచ్చి, అధికారుల సహకారంతో జేబులు నింపుకుంటున్నారు.

ఉపాధి సిబ్బంది సహకారంతోనే అక్రమాలు

జేసీబీలతో చేసిన పనులను ఉపాధి కూలీలతో చేయించినట్లు జాబ్‌కార్డున్న వారిపై మస్టర్లు సృష్టించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా బిల్లులు చేసుకుంటున్నారు. వీరికి ఉపాధి ఏపీడీ మొదలు ఏపీఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు బాగా సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు గతంలో ఉన్న మేట్లను తొలగించి కూటమికి అనుకూలంగా ఉన్నవారిని నియమించడం విదితమే. దీంతో ఉపాధిలో అక్రమాలు మూడు గుంతలు–ఆరు చెరువులు అన్న చందంగా పలమనేరు నియోజకవర్గంలో అక్రమాలుజోరుగా సాగుతున్నాయి.

నిబంధనల ప్రకారం చేయాల్సిన పనులివీ!

ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు చేయాలంటే గ్రామసభలను నిర్వహించి అవసరమైన పనులను గుర్తించాలి. ఆపై జాబ్ కార్డున్న వారికి పనులు కలిప్పించాలి. ఈ తీర్మానాన్ని సంబంధిత పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు ఆమోదించాలి. ఆపై ఉపాధి అధికారులు పనులు పర్యవేక్షిస్తూ, పనులు చేయించి, వాటిని మస్టర్లలో నమోదు చేయాలి. అలాగే జీపీఎస్ ఆధారంగా రోజూ పనులు చేస్తున్న కూలీల ఫొటోలను సైతం అప్‌లోడ్ చేసి ఆపై బిల్లులు పెట్టాలి. కానీ కూటమి నేతలు ఉపాధి అధికారులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. జరుగుతున్న పనుల్లో 80 శాతం వరకూ నిధులను బొక్కేస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

పలమనేరు నియోజకవర్గంలో...

మొత్తం మండలాలు	:	5
మొత్తం పంచాయతీలు	:	90
మొత్తం గ్రామాలు	:	520
ఈ పర్యాయం ఈజీఎస్ బడ్జెట్	:	రూ.5కోట్లకు పైగా
చేస్తున్న పనులు	:	నీటి కుంటల నిర్మాణం, చెరువుల్లో పూడికతీత, చేలకు బంకమట్టి, క్యాటిల్ షెడ్లు, హార్టికల్చర్ ద్వారా మొక్కల నాటడం తదితరాలు

ఇప్పుడు సాగుతున్న అక్రమాలిలా...

ప్రస్తుతం ఉపాధి పనుల్లో ఉద్యానవన మొక్కలు నాటామంటూ గతంలో పాదులు చేసిన వాటిని కూలీలతో ఫొటోలు తీసి బిల్లులు చేసుకుంటున్నారు. సప్లయ్ ఛానళ్లు, నీటి కుంటల నిర్మాణ పనులు మొదలైనవి జేసీబీలతో చేసి వాటిని కూలీలు చేసినట్టు తప్పుడు రికార్డులు సృష్టించి నిధులు మెక్కుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని చోట్లా ఉపాధి పనులు కూటమి నాయకులకు కాసులు కురిపించే ఏటీఎంలుగా మారాయి. అక్రమాలతో వచ్చిన డబ్బులో కొంత బినామీ కూలీలకు, మరికొంత ఉపాధి సిబ్బందికి, మిగిలిన సింహభాగం నేతలకు దక్కుతున్నట్టు తెలుస్తోంది. నియోజకవర్గంలో ఈ ఆరు నెలల కాలంలో రూ.5కోట్ల విలువైన పనులు చేయగా ఇందులో రూ.4కోట్ల వరకూ అక్రమాలు సాగినట్టు సమాచారం. కనీసం జిల్లా అధికారులైనా ఇక్కడ జరిగిన, చేస్తున్న ఉపాధి పనులను పరిశీలిస్తే అక్రమాలు వెలుగు చూస్తాయి. దీనిపై ఉపాధి ఏపీఓ ఎం.పుష్పలత వివరణ కోరగా.. హార్టికల్చర్ ద్వారా మామిడి పాదులు, ఫీడర్ చానల్స్ పనులు మాత్రమే సాగుతున్నాయని తెలిపారు. నీటికుంటలు, చెరువుల్లో పనులకు అనుమతులు ఇవ్వలేదన్నారు. వాహనాలతో పనులు చేస్తున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. ఎవరైనా జేసీబీలతో పనులు చేసినా తాము బిల్లులు పెట్టమని తెలిపారు.

మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం



కల్లూరులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

–కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

పులిచెర్ల(కల్లూరు): మామిడి రైతుల కష్టాలు గుర్తించామని, వారికి గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన కల్లూరులోని డీఎల్ఎస్ మామిడి కాయల మండీని పరిశీలించారు. వివిధ రకాల మామిడి కాయల ధరలు ఇక్కడ ఎలా ఉందో ఆరా తీశారు. పులిచెర్ల మండలంలో మామిడి గుజ్జు పరిశ్రమలు లేకపోవడంతో మండీ వ్యాపారులు, రైతులతో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి కిలో రూ.3.50 ధరతో కాయలు (తోతాపురి) కొనుగోలు చేస్తే తాను మూడు ఫ్యాక్టరీలతో మాట్లాడి రూ.5 ఇప్పించేలా చూస్తానన్నారు. మండీలకు మామిడి కాయలలోడ్లు ఎక్కువగా వస్తున్నాయని, అయితే ధర పడిపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నట్టు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఒకవేళ ఫ్యాక్టరీలకు మామిడి కాయల లోడ్లను తీసుకెళ్లినా టోకెన్లు పొందడం గగనమవుతోందని రైతులు నివేదించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, సంతోషకుమారి, తహసీల్దార్ జయసింహ, ఎంపీడీఓ రాజశేఖరబాబు పాల్గొన్నారు.

కుల వివక్ష పోరాట సమితి ధర్నా




బస్టాండులో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న కుల వివక్ష పోరాట సమితి నాయకులు

చౌడేపల్లె: దళిత సర్పంచ్‌ను స్టేజీ పైకి రానీయకుండా ఎస్సీ అంటూ గుర్తు చేసి మరీ అవమానించిన బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు క్రిష్ణమ్మపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష పోరాట సమితి డివిజినల్ కార్యదర్శి డాక్టర్ చంద్ర డిమాండు చేశారు. శుక్రవారం స్థానిక బస్టాండులో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వాసుతో కలిసి ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఇటీవల కర్నూలు జిల్లా డాణాపురంలో జరిగిన సమావేశంలో బీజేపీ నాయకుల వ్యవహరించిన తీరు దళితుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. కుల ప్రస్తావన చేస్తూ క్రిష్ణమ్మ దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను వేదిక వద్ద కాళ్లవద్దనే నిలబడేలా చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి, క్రిష్ణమ్మలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు పార్టీల నుంచి వారిని బహిష్కరించాలని డిమాండు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మల్లేష్, మునిరత్న, లక్ష్మయ్య, వెవెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, అల్లాబాషా, రెడ్డెప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బంధుప్రీతితోనే సీఎం అమరావతి నిర్మాణం

- బినామీలతో వందల ఎకరాలు కొనుగోలు చేసిన మంత్రులు
- రూ.57 వేల కోట్లు గుంటూరుకే ఖర్చు చేయడం సరికాదు
- కృష్ణా నదీ తీరంలో 50 అంతస్తుల భవనాల నిర్మాణం సాధ్యమా?
- రాష్ట్రానికి, కుప్పానికి సీఎం చేసిందేమీ లేదు
- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శ



కుప్పం: ముఖ్యమంత్రికి రాజధాని కంటే బంధుప్రీతితో అమరావతి నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతామోహన్ ఆరోపించారు. శుక్రవారం కుప్పం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. అమరావతిని దేవతల రాజధానిగా సీఎం గొప్పలు చెప్పుకుంటున్నారని, తనకైతే దేవుడుగానీ దేవతలుగానీ అక్కడ కనిపించడం లేదని, అరటి చెట్లు, కర్ర తుమ్మ చెట్లు మాత్రమే కనిపిస్తున్నాయని ఛలోక్తులు విసిరారు. ముఖ్యమంత్రికి బంధువులు అమరావతిలో ఉండడం, అలాగే మంత్రులు బినామీల పేర్లతో వందలాది ఎకరాల భూములు అమరావతి చుట్టుపక్కల కొనుగోలు చేయడంతో వారి భూములకు విలువ పెంచేందుకు సీఎం మళ్లీ అమరావతి జపం చేస్తున్నారని విమర్శించారు. పైగా, అమరావతికి వేల కోట్లు కుమ్మరిస్తూ అభివృద్ధి చేస్తున్నామని అబద్ధాలు చెబుతున్నారని ఆయన అన్నారు. మరోవైపు రాష్ట ప్రభుత్వం రూ.57 వేల కోట్లు గవర్నమెంట్ గ్యారెంటీతో అప్పులు చేసి, కేవలం గుంటూరు జిల్లాలోనే ఖర్చు చేయడం ఎంతమాత్రమూ సరికాదని ఆక్షేపించారు. కృష్ణానది ప్రాంతంలో 50 అంతస్తుల భవనాల నిర్మాణం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. మూరెడు గొయ్యి తవ్వితే నీళ్లు వచ్చే ఈ ప్రాంతంలో భారీ భవనాలు నిర్మిస్తే కుప్పకూలడం తథ్యమన్నారు. చేశారు. సీఎంగా చంద్రబాబు రాష్ట్రానికి, కుప్పానికి చేసిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వల్ల ప్రజాస్వామ్యం కుప్పకూలిపోయిందన్నారు.

బండకిందపల్లెలో విత్తనాల పంపిణీ



సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ శ్రావణి

సాక్షి ఎఫెక్ట్..

రొంపిచెర్ల: మండలంలోని బండకిందపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని రైతులకు శుక్రవారం సబ్సిడీ వేరుశనగ విత్తనాలను అధికారులు పంపిణీ చేశారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో «బండకిందపల్లెలో రైతులకు అందని సబ్సిడీ విత్తనాలు» శీర్షికతో ప్రచురించిన కథనంపై నూతన ఏఓ శ్రావణి స్పందించారు. అప్పటికప్పుడు రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులకు అవసరమైన విత్తనాలను బండకిందపల్లె గ్రామ రైతు సేవా కేంద్రానికి అధికారులు మంజూరు చేయలేదని, 15 రోజులుగా విత్తనాల పంపిణీ ఆగిపోయిందని సాక్షి వెలుగులోకి తేవడంతో విత్తనాలను పంపిణీ కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రం సహాయకులు ప్రారంభించారు. 15 రోజులుగా వేరుశనగ విత్తనాల కోసం ఎదురు చూసిన రైతులకు సంతోషం వ్యక్తం చేశారు.

పత్తాలేని సెరికల్చర్ అధికారులు

- దరఖాస్తులు ఇచ్చి ఆరు నెలలైనా రాయితీలేవీ?
- గ్రామాలను పట్టించుకోవడం లేదని మండిపడుతున్న రైతులు



రైతులు సాగు చేసిన మల్బరీ తోటలు

గుడుపల్లె: వర్షాలు సక్రమంగా పడకపోవడంతో కొద్దో గొప్పో నీరున్న బోరులలో మల్బరీ సాగు చేస్తూ, పట్టు పురుగుల పెంపకంపై ఆధారపడిన రైతుల ఆర్థిక స్థితిగతులను మెరు పరిచే దిశగా సెరికల్చర్ రైతులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. అసలు పట్టుపురుగుల పెంపకం రైతులకు సెరికల్చర్ శాఖాపరంగా ఉపయోగపడే సమాచారం, పథకాలు, శిక్షణ, పంట సాగులో పాటించిన యాజమాన్య పద్ధతులు, పట్టు పురుగుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..ఇత్యాదివేమీ వారికందడం లేదు. ప్రభుత్వం పట్టుపురుగుల పెంపకానికి సంబంధించి రైతులకు రాయితీపై పొడర్లు ఇచ్చేది. ప్రస్తుతం సెరికల్చర్ అధికారులు గ్రామాలను సందర్శించి పట్టుపురుగుల రైతులకు అవగాహన కార్యక్రమాలేవీ నిర్వహించిన పాపానపోవడం లేదు. మండలంలో 60 గ్రామాలలో 350 మంది రైతులు సెరికల్చర్‌పై ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నారు.

గ్రామాల్లో పర్యటించని అధికారులు

పట్టు పరిశ్రమ శాఖ అధికారులు గ్రామాల ముఖంకేసి చూడకపోవడంతో ప్రభుత్వ రాయితీలు అందడం లేదని సంబంధిత రైతులు మండిపడుతున్నారు. గతంలో ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి పురుగులకు వేసే పొడర్లను రాయితీపై ఇచ్చేది. అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో ఇవేవీ అందడం లేదు. అలాగే పట్టు పురుగులకు వేసే బ్లీచింగ్, సున్నం మొదలైనవి ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

దరఖాస్తులకు మోక్షం ఎప్పుడో..?

మల్బరీ పంట సాగులో రాయితీలు పొందడానికి ఆఫీసుకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని క్షేత్ర స్థాయిలో ఉన్న అధికారి చెబుతున్నారు. వాస్తవానికి ఏడాది క్రితం రైతులు మల్బరీ మొక్కలు నాటారు. వాటి పెంపకానికి ఉపాధి హామీ పథకం కింద ఇచ్చే మెయింటెన్స్‌కు ఆరునెలల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. మండలంలోని అగరం, కొత్తపల్లె, తోడేలుగట్టు గ్రామాల రైతులు వీరిలో ఉన్నారు. కానీ ఇప్పటివరకు ఆ దరఖాస్తులకు మోక్షం లేదు. సెరికల్చర్ అధికారులు మాత్రం గ్రామాల్లో రైతులను కలిసి దరఖాస్తులు తీసుకోకుండా రైతులే కార్యాలయాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని క్షేత్ర స్థాయి అధికారులు భీష్మించుకున్నారు. ఉన్నతాధికారులైనా సెరికల్చర్ రైతుల సమస్యలపై స్పందించాలని, పంటలను పరిశీలించి ఉపాధి హామీ రాయితీలు అందేలా చూడాలని పట్టు రైతులు కోరుతున్నారు.

నోటీస్ బోర్డు

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- శాంతిపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీ లెక్చరర్ పోస్టులకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.విజయకుమార్ తెలిపారు. మ్యాథ్స్, హిందీ పోస్టులకు గెస్ట్ లెక్చరర్ల నియామకానికి ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈ నెల 25లోపు తమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

23న బోయకొండలో హుండీ లెక్కింపు

- చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 23 వతేది సోమవారం హుండీ ఆదాయం లెక్కించనున్నట్టు ఈఓ ఏకాంబరం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది విధిగా హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

- సదుం: మండలంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సదుం, నడిగడ్డ, గొడ్లవారిపల్లె ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అయ్యో మామిడి రైతులు..!



కల్లూరు సమీపంలో నేలపారబోస్తున్న ట్రాక్టర్ లోడు తోతాపురి కాయలు

- కొనేవారు లేక కాయలు పారబోస్తున్న వైనం

పులిచెర్ల(కల్లూరు): ఈఏడాది మామిడి రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ప్రత్యేకించి తోతాపురి ధర అమాంతంగా పడిపోవడంతో కూలీ కోతలు కూడా గిట్టుబాటు కాక రోడ్డు పక్కనే పారబోస్తున్నారు. కల్లూరు సమీపంలో తోతాపురి కాయలను విక్రయించేందుకు మండీలవద్దకు తీసుకువచ్చారు. అయితే ఎవరూ కొనకపోవడంతో రోడ్డు పక్కనే ట్రాక్టరు కాయలు పారబోస్తున్నారు. జ్యూస్ ఫ్యాక్టరీల వద్దకు వెళితే టోకెన్లు అందకపోవడం, మండీల వద్ద వ్యాపారులు కాయలు కొనకపోవడంతో మామిడి రైతులకు దిక్కుతోచడం లేదు.